సాక్షి కామారెడ్డి

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



భూ సమస్యల పరిష్కారానికే..
భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు.
- IIIలో ▸



సొంతింటి కల నెరవేర్చాం
పేదల సొంతింటి కలను నెరవేర్చామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
44.6 /22.3

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

జోరుగా బెట్టింగ్

- గల్లీగల్లీకి పాకిన సంస్కృతి
- వ్యసనంగా మారిన వైనం
- దృష్టి సారించని పోలీసు శాఖ



కామారెడ్డి క్రైం : క్రికెట్ అంటే చాలామందికి ఇష్టం. గతంలో ఆటను ఆటగానే చూసేవారు. తమ అభిమాన ఆటగాళ్ల ఆటను చూసేందుకు టీవీల ముందునుంచి కదిలేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఆట జూదంగా మారిపోయింది. చాలా మంది బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయారు.

బాల్ బాల్‌కు పందెం..

బెట్టింగ్ సంస్కృతి గల్లీలకూ పాకింది. నిర్వాహకులను సంప్రదించి మ్యాచ్‌ల వారీగా, ఓవర్‌ల వారీగా పందాలు కాస్తున్నారు. మ్యాచ్ ఆసక్తికరంగా మారితే బంతి బంతికీ బెట్టింగ్ నడుస్తోంది. ఈ వ్యసనానికి బానిసైనవారు బెట్టింగ్‌లో నష్టపోతూ ఆర్థికంగా దివాలా తీస్తున్నారు. మానసికంగానూ నలిగిపోతున్నారు. అప్పుల పాలై, వాటిని ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు సైతం ఉన్నాయి. ఇటీవల దేవునిపల్లికి చెందిన ఓ యువకుడు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. అతని అప్పులకు క్రికెట్ బెట్టింగ్ ప్రధాన కారణమని తెలిసింది. ఆస్తులు అమ్ముకునే పరిస్థితి వచ్చిన కుటుంబాలు కూడా ఎన్నో ఉన్నాయి. పరువు పోతుందని బయటకు చెప్పుకోలేని వారు కూడా ఉన్నారు.

నిఘా కరువు..

ఐపీఎల్ ప్రారంభమైన నాటి నుంచి జిల్లావ్యాప్తంగా జోరుగా బెట్టింగ్ నడుస్తోంది. ఇది బహిరంగ రహస్యమే.. ఒక్క నిజామాబాద్ పోలీసులు మాత్రమే ఈ ఏడాది బెట్టింగ్ ముఠాను గుర్తించి పట్టుకున్నారు. మిగతా ఎక్కడా ఐపీఎల్ బెట్టింగ్ మూలాలను గుర్తించలేదు. కామారెడ్డి, బాన్సువాడ లలో గతంలో కొన్ని ముఠాలు బెట్టింగ్ నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు పంపారు. ఈ సీజన్‌లో కూడా అన్ని ప్రాంతాల్లో జోరుగా బెట్టింగ్ నడుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో బెట్టింగ్ ముఠాలు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా.. మండలాలు, గ్రామాల్లో వ్యక్తుల మధ్య నేరుగా పందాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దందాను అడ్డుకునే విషయమై పోలీసు శాఖ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కేసీఆర్ వెంటే..

- తెలంగాణ కోసం బీఆర్‌ఎస్‌తో కలిసి నడిచిన జిల్లావాసులు
- రాష్ట్రమొచ్చాకా కారుకే మద్దతు
- పాతికేళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు



ఎల్లారెడ్డిలో తెలంగాణ కోసం రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ రాష్ట్రం కోసం 2001 లో డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి గులాబీ జెండా అందుకుని కదనరంగాన దూకిన కేసీఆర్‌కు జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పల్లెలన్నీ ఆయన వెంట నడిచాయి. కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివెళ్లారు. కామారెడ్డి న్యాయవాదులు అప్పటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిర్మల్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ కోసం తొలి తీర్మానం చేసి కరీంనగర్ సభకు వెళ్లారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ సమయంలోనే వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో మెజారిటీ మండలాల్లో గులాబీ జెండా ఎగిరింది. ఉమ్మడి జిల్లా పరిషత్‌ను ఆ పార్టీ కైవసం చేసుకుంది. 2004 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌తో బీఆర్‌ఎస్ పొత్తుపెట్టుకుంది. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కామారెడ్డి ప్రాంతంలోని అన్ని అసెంబ్లీ స్థానాలతోపాటు ఒక పార్లమెంట్ స్థానం కూడా కూటమే గెలుచుకుంది. 2009 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్, టీడీపీలు మహాకూటమిగా ఏర్పడి క్లీన్ స్వీప్ చేశాయి. అప్పటి సీఎం వైఎస్సార్ మరణానంతరం తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం మరోమారు ఊపందుకుంది. ఉద్యమ తీవ్రత పెరగడంతో టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గంప గోవర్ధన్, హన్మంత్ సింధేలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడి గులాబీ కండువా కప్పుకున్నారు. 2010లో కామారెడ్డి, బాన్సువాడలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా గోవర్ధన్, పోచారం పోటీచేసి గెలిచారు.

'తెలంగాణ'లోనూ..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే 2014 లో జరిగిన ఎన్నికల్లో నాలుగు అసెంబ్లీ స్థానాలతో పాటు ఒక ఎంపీ స్థానాన్ని కూడా బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. 2018 ఎన్నికల్లో ఎల్లారెడ్డిలో మాత్రమే గులాబీ పార్టీ ఓడిపోయింది. అనంతరం రాజకీయ పరిణామాలతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కూడా బీఆర్‌ఎస్ గూటికి చేరారు. జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని బీఆర్‌ఎస్ నిలబెట్టుకుంది. కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తర్వాత తొలి జెడ్పీ పీఠం, మండలాలు, మున్సిపాలిటీలు కూడా బీఆర్‌ఎస్ గెలుచుకుంది. 2023 ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. కామారెడ్డి నుంచి పోటీ చేసిన కేసీఆర్ ఓటమి చెందారు. ఎల్లారెడ్డి, జుక్కల్‌లలోనూ పరాజయం తప్పలేదు. బాన్సువాడలో గులాబీ జెండా ఎగిరినా.. కొద్ది కాలానికే పోచారం కాంగ్రెస్ గూటికి చేరారు.

కొనుగోళ్లను వేగవంతం చేయండి



దోమకొండ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం దోమకొండలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున రైతులకు టార్పాలిన్‌లు అందజేయాలన్నారు. తూకం వేసిన వడ్లను వెంటవెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, డీసీవో రామ్మోహన్, మండల ప్రత్యేకాధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పించడానికే భూభారతి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

దోమకొండ/బీబీపేట: రైతులకు భరోసా కల్పించడానికే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. శనివారం దోమకొండ, బీబీపేటలలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుల లో ఆయన పాల్గొన్నారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మండలాల వారీగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. భూ సమస్యలకు ఈ చట్టంలో పరిష్కారాలు ఉన్నాయన్నారు.

ఫాం పాండ్స్ నిర్మించుకోవాలి

రైతులు పొలాల్లో ఫాం పాండ్స్ నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోయేలా చేసి భూగర్భ జలాలను పెంచేందుకు ఫాం పాండ్స్, ఇంకుడు గుంతలు, కాంటూరు కందకాలు ఉపయోగపడతాయన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద కనీసం 5 ఫాం పాండ్స్ నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో భిక్కనూరు ఏఎంసీ చైర్మన్ పాత రాజు, ఆర్డీవో వీణ, దోమకొండ మండల ప్రత్యేకాధికారి జ్యోతి, తహసీల్దార్లు సంజయ్‌రావు, సత్యానారాయణ, ఎంపీడీవోలు ప్రవీణ్‌కుమార్, పూర్ణచంద్రోదయ కుమార్, నాయకులు తిర్మల్ గౌడ్, ఐరేని నర్సయ్య పాల్గొన్నారు.

మధ్యలోనే వెళ్లిపోయిన కలెక్టర్

దోమకొండలో కలెక్టర్ మాట్లాడుతున్న సమయంలో ఇద్దరు రైతులు తమ భూ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గతంలో అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అధికారులు వారికి సర్దిచెప్పినా వినలేదు. దీంతో కలెక్టర్ తన ప్రసంగం ముగించి మధ్యలోనే వెళ్లిపోయారు.

ఇందూరు నుంచి ఓరుగల్లుకు..

- ఉమ్మడి జిల్లా నుంచి తరలివెళ్తున్న గులాబీ దండు
- 250 ఆర్టీసీ, 260 ప్రైవేటు బస్సులు, వేలాది కార్లు..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నిర్వహించనున్న వరంగల్ జిల్లా ఎల్కతుర్తికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి గులాబీ శ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శ్రేణుల తరలింపులో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంతో పాటు బాన్సువాడ నియోజకవర్గం నుంచి శ్రేణుల తరలింపు కోసం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ కవిత, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పార్టీ అధ్యక్షులు జీవన్‌రెడ్డి, ముజీబొద్దీన్, మాజీ ఎమ్మెల్యేలు షకీల్, గణేశ్‌గుప్తా, సురేందర్, హన్మంత్ సింధే, గంప గోవర్ధన్ ఆయా నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించి శ్రేణులను సమాయత్తం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి వెళ్లే వాహనాలకు బహిరంగ సభ వద్ద జోన్ 5లో పార్కింగ్ కేటాయించారు. 250 ఆర్టీసీ, 260 ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేశారు. కామారెడ్డి జిల్లా నుంచి సుమారు వెయ్యి కార్లు, నిజామాబాద్ జిల్లా నుంచి సుమారు 2 వేల కార్లలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లనున్నారు.

ఏదడిగినా కేసీఆర్ కాదనలేదు..

- నీటిపారుదల విషయంలో ప్రతి ప్రయోగం ఇక్కడి నుంచే మొదలు
- మోతె గ్రామస్తుల ఉద్యమ స్ఫూర్తి అజరామరం
- స్వరాష్ట్రం సిద్ధించాక సీఎం హోదాలో మోతె వచ్చిన కేసీఆర్
- రజతోత్సవ సభ నేపథ్యంలో 'సాక్షి'తో వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అభివృద్ధి పనుల విషయంలో ఏదడిగినా కేసీఆర్ కాదనలేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ రజతోత్సవం నేపథ్యంలో 'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రశాంత్‌రెడ్డి పలు విషయాలను గుర్తుచేసుకున్నారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

మోతెలో తీర్మానం.. ముడుపు కట్టిన కేసీఆర్..

తీవ్రమైన కరువు సమస్యను ఎదుర్కొంటున్న వేల్పూర్ మండలంలోని మోతె గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కారం కావాలంటే స్వరాష్ట్రం సాధించుకోవాల్సిందేనని నిశ్చయించుకున్నారు. 2001లో కేసీఆర్ బీఆర్‌ఎస్ ఏర్పాటు చేశాక ఏకగ్రీవ తీర్మానం చేసి కేసీఆర్ వైపు నిలబడ్డారు. ఇదే స్ఫూర్తితో మెండోరా మండలంలోని బుస్సాపూర్ గ్రామస్తులు తీర్మానం చేసుకుని బీఆర్‌ఎస్‌కు జైకొట్టారు. తరువాత రాష్ట్రవ్యాప్తంగా వరుసగా అనేక గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతు పెరిగింది. మోతె గ్రామానికి 2001 మే 5న కేసీఆర్ వచ్చి ఇక్కడి మట్టితో ముడుపు కట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు పార్లమెంట్‌లో పాసయ్యాక 2014 మార్చి 28న కేసీఆర్ గ్రామానికి వచ్చి ముడుపు విప్పారు. తరువాత మళ్లీ ముఖ్యమంత్రి హోదాలో 2015 జూలై 6 న ఇక్కడికి వచ్చి గ్రామంపై వరాలు కురిపించారు. గ్రామంలో చెరువు, మాటు కాలువ, పాఠశాల, ప్రత్యేకంగా పీహెచ్‌సీ, కొత్త గ్రామపంచాయతీ, రూ.2 కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణమయ్యాయి. అప్పుడు వేల్పూర్‌లోని మా పెంకుటిల్లులోనే కేసీఆర్ బస చేశారు.

తండ్రి ఆశయాలను కొనసాగిస్తున్నా..

స్వరాష్ట్రం వస్తేనే అనుకున్న విధంగా అభివృద్ధి సాధ్యమని, గ్రామాలు స్వయం సమృద్ధి సాధించాలంటే చిన్ననీటి వనరులను పెపొందించుకోవాలని మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి చెప్పేవారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తున్నా.

ఇక్కడ మొదలుపెట్టి..

చెక్‌డ్యాముల నుంచి మొదలు అనేక నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి ప్రయోగం ఇక్కడే చేశాం. ఇక్కడ సక్సెస్ చేశాక కేసీఆర్ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అమలు చేశారు. ఎస్సారెస్పీ వరద కాలువకు కింది లెవెల్‌లో 16 తూములు ఏర్పాటు చేయడంతో 45 చెరువులు నిండుతున్నాయి. కాళేశ్వరం ద్వారా ప్రతి రెండున్నర ఎకరాలకు ఒక అవుట్‌లెట్ పాయింట్ ఏర్పాటు చేశాం.

జగన్‌మోహన్‌రెడ్డికి పైలట్‌గా..

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినప్పుడు ఆయనను రిసీవ్ చేసుకుని పైలట్‌గా వ్యవహరించే బాధ్యతను కేసీఆర్ నాకు అప్పగించారు. దీన్ని ఎప్పటికీ మరిచిపోలేను.

ఇకపై ఫార్మసీ ఆఫీసర్స్

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ పోస్టుల పేర్లను ఫార్మసీ ఆఫీసర్స్‌గా మారుస్తూ వైద్య ఆరోగ్య శాఖ జీవో నంబర్ 71 జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ విన్నపం మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అసోసియేషన్ జిల్లా ప్రతినిధి నీల లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో దూడలకు గాయాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి శివారులోని పందిరి కొట్టంలో ఉంచిన రెండు గేదె దూడలపై శనివారం కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. స్థానికులు గమనించి వాటిని చికిత్స నిమిత్తం పశువుల ఆస్పత్రికి తరలించారు. గతంలో కూడా మండలంలోని కరడ్‌పల్లి, తాడ్వాయి, నందివాడ శివారులో పశువుల పాకలో ఉంచిన మేకలు, గొర్రెల పిల్లలు, లేగదూడలపై దాడిచేశాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో ఉన్న కుక్కలను బయటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారి పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల కోసం నియమించిన యాక్సిడెంట్ రిజల్యూషన్ బృందం శనివారం గాంధారిలో రహదారిని పరిశీలించారు. పలువురు స్థానియ నాయకులతో మాట్లాడారు. ఈ బృందంలో సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, సహాయ మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, ఆర్‌అండ్‌బీ ఏఈ రవితేజ తదితరులున్నారు.

అలరించిన చిన్నారులు



మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేట ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనతో అందరిని అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల వేదిక నిర్మాణ దాత బూస శ్రీనివాస్, రూ. 50వేల విలువైన సామగ్రిని బహూకరించిన అర్కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ చెప్యాల గోవర్ధన్ రెడ్డి, పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన గ్రామస్తులతో పాటు ఇటీవల గ్రూప్‌- 1 పరీక్షల్లో విజయం సాధించిన భూస ఉదయ్ కిరణ్ ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్కిరెడ్డి రాజేశ్వరరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు భవాని, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మక్బూల్, మాజీ ఎంపీటీసీ బూస శ్రీనివాస్, జయరామశర్మ, ఉపాధ్యాయులు గ్రామస్తులు ఉన్నారు.

ధాన్యం కుప్పలు.. వాహనదారులకు తిప్పలు

- ఎల్లారెడ్డి మండలంలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



హాజీపూర్ శివారులో ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యం.. పక్కన రాళ్లు

ఎల్లారెడ్డిరూరల్: రైతులు పండించిన పంటలను కల్లంలో ఆరబెట్టాల్సి ఉన్నప్పటికి ప్రధాన రహదారులపై ఆరబెట్టడంతో పాటు పక్కన పెద్ద పెద్ద బండరాళ్లు ఉంచడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఎన్నిసార్లు అవగాహన కల్పిస్తున్నా రైతులు పెడచెవిన పెడుతున్నారు. ఈ కారణంగా రాత్రివేళల్లో వరి కుప్పలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండా, లక్ష్మాపూర్ గ్రామాలలో ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబెట్టడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై పంటల నూర్పిడి చేయకుండా, ధాన్యం ఆరబెట్టకుండా తగిన చర్యలను తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలి

రోడ్డుపై ధాన్యం ఆరబెట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ధాన్యం ఆరబెట్టకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా బైకుపై వెళ్లేవారు గాయాలపాలవుతున్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డుపై ధాన్యం ఆరబెట్టకుండా చూడాలి.

– విజయ్ కుమార్, లింగంపేట

కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలి

రైతులు ధాన్యాన్ని కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలి. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టుకోవడం సరికాదు. ధాన్యం కుప్పల మీద రాళ్లు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అనుకోని ప్రమాదాలు జరిగితే దానికి పూర్తి బాధ్యులు ధాన్యం ఆరబెట్టిన వారవుతారు.

– మహేష్, ఎస్సై, ఎల్లారెడ్డి

బేస్‌మెంట్ దశలో నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం



బోర్లంలో నిలిచిన మరుగుదొడ్ల పనులు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి నిర్మించ తలపెట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. 180మంది విద్యార్థులున్న ఈపాఠశాలలో ఒకే ఒక మరుగుదొడ్డి ఉండటంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది పూర్తి కావస్తున్న టాయిలెట్ల నిర్మాణం పూర్తి కావడం లేదు. అధికారులు బిల్లు నమోదు చేయక పోవడంతో కాంట్రాక్టర్ పనులను బేస్‌మెంట్ దశలో నిలిపివేశారు. వచ్చే విద్యాసంవత్సరం వరకు టాయిలెట్ల నిర్మాణ పనులు పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి కందూరి లింబాద్రి సస్పెండ్



మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు లక్ష్మాగౌడ్

రామారెడ్డి: కాంగ్రెస్ పార్టీలో ప్రజలకు సేవ చేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మా గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ కబ్జాలతో పాటు, హత్య కేసులో నిందితుడిగా ఉన్న రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి చెందిన కందూరి పెద్ద లింబాద్రిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిలాసాగర్, ఇర్ఫాన్, రంజిత్, భాస్కర్ ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింల కోసమే వక్ఫ్ చట్టం

ఎల్లారెడ్డి: పేద ముస్లింల కోసమే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టం తీసుకొచ్చిందని బీజేపీ నాయకులు నర్సింలు అన్నారు. ఎల్లారెడ్డి బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రాములు, బాలకిషన్ తదితరులున్నారు.

'నాణ్యమైన విద్యుత్ అందిస్తాం'

కామారెడ్డి అర్బన్: నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం జిల్లాలో 159 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతోపాటు 92 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వచ్చే పదేళ్ల కాలానికి ఉపయోగపడేలా అంచనాలు వేసి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

నేడు ఆర్య సమాజ్ స్వర్ణోత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్య సమాజ్‌ను ప్రారంభించి 50 ఏళ్లవుతున్న సందర్భంగా ఆదివారం స్వర్ణోత్సవాలను నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి జిల్లాకేంద్రంలోని శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్య సమాజ్ పట్టణ అధ్యక్షుడు కంకణాల కిషన్, ప్రతినిధులు డి.అరుణ, శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, సూర్యానారాయణగుప్తా, పైడి రాకేష్‌రెడ్డిలను ఆహ్వానించామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు 108 కుండాలతో గాయత్రి యజ్ఞం నిర్వహిస్తామని, ప్రజలు ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు.

యువ ఆర్యవీర్ దళ్ శిబిరం ప్రారంభం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని పాతరాజంపేట ఆర్షగురుకులంలో శనివారం ఆర్యవీర్ దళ్ యువ నిర్మాణ శిబిరాన్ని గురుకులం అధిపతి స్వామి బ్రహ్మానంద సరస్వతి ప్రారంభించారు. మే నెల 4వ తేది వరకు నిర్వహించే శిబిరానికి తెలుగు రాష్ట్రాల నుంచి యువకులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఆచార్య సందీప్, శైలేషకుమార్ ఆర్య, కనిష్క ఆర్య, రాంనివాస ఆర్యలతో పాటు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు 'మోడల్' ప్రవేశ పరీక్ష

నాగిరెడ్డిపేట : మండలంలోని గోపాల్‌పేట మోడల్ స్కూల్‌లో అర్హులైన విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు.ఆరోతరగతిలో ప్రవేశానికి సంబంధించి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు 7, 8, 9, 10తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

అంబలి కేంద్రం, చలివేంద్రాలను ప్రారంభించిన కలెక్టర్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఉద్యోగ జేఏసీ, టీఎన్‌జీవోఎస్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం, చలివేంద్రాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ అవసరాల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. ఈకేంద్రాలను ఏర్పాటు చేసిన ఉద్యోగ జేఏసీ, టీఎన్‌జీవోఎస్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, టీఎన్‌జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి..

దోమకొండ: అర్హత కలిగిన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో భూభారతి కార్యక్రమాన్ని ముగించుకొని కామారెడ్డికి వెళ్తుండగా మార్గమధ్యలో షేక్ అల్మా బేగం ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. తాను, తన భర్త కూలీ పనిచేస్తూ ఇద్దరు పిల్లలతో కలిసి ప్లాస్టిక్ కవర్‌లతో కప్పిన గుడిసెలో ఉంటున్నామని వారు ఆయనకు తెలిపారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. మండల ప్రత్యేక అధికారిని జ్యోతి, ఎంపీపీవో ప్రవీణ్‌కుమార్, జీపీ కార్యదర్శి యాదగిరి, తదితరులున్నారు.

తహసీల్దార్ తీరుపై ప్రజాప్రతినిధుల అసహనం



తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన నాయకులు

దోమకొండ: మండలకేంద్రంలో కలెక్టర్ పర్యటన సందర్భంగా తహసీల్దార్ సంజయ్‌రావు తీరుపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు.మండల కేంద్రంలోని రైతు వేదికలో కలెక్టర్ ఆధ్వర్యంలో భూభారతి కార్యక్రమం ఉందని, తమకు సమచారం ఇవ్వలేదని భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజ్ రెడ్డి, మాజీ సర్పంచ్ నల్లపు శ్రీనివాస్, పలువురు ఆయనతో వాగ్వాదానికి దిగారు. ఎస్‌ఐ ప్రవంతి, ఇతర అధికారులు వారిని సముదాయించారు.

నిలువ చేస్తే నిరాశే మిగిలింది



ఆరబోసిన ఎర్రజొన్నలు(ఫైల్)

- తగ్గిన ఎర్రజొన్నల ధర
- ఆవేదనలో అన్నదాత

మోర్తాడ్(బాల్కొండ): నిలువ చేసిన పంటను సీజన్ ముగిసిన తర్వాత విక్రయించుకుందామనుకున్న ఎర్రజొన్న రైతులకు నిరాశే మిగిలింది. గత సీజన్‌లో ఎర్రజొన్న క్వింటాల్‌కు రూ.3,800 ధర లభించడంతో మోర్తాడ్‌కు చెందిన మహిపాల్ అనే రైతు 40 క్వింటాళ్ల ఎర్రజొన్నలను నిలువ చేసుకున్నాడు. సీజన్ ముగిసిన తర్వాత కనీసం రూ.4,200 ధర లభిస్తుందని ఆశించాడు. కానీ, విత్తన వ్యాపారుల సిండికేట్‌తో సీజన్ ముగిసినా ధర ఏమాత్రం పెరగకపోగా కనీసం సీజన్‌లో లభించిన ధర కూడా దక్కలేదు. దీంతో వారం కింద క్వింటాల్‌కు రూ.400 తక్కువకు పంటను విక్రయించాడు. సుమారు రూ.16 వేల నష్టానికే మహిపాల్ తన పంటను విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిపాల్ మాదిరిగానే ఎర్రజొన్నలను నిలువ చేసుకున్న రైతులందరూ తక్కువ ధరకే తమ పంటను విక్రయించారు. రైతుల వద్ద దాదాపు 5వేల క్వింటాళ్ల ఎర్రజొన్నలు నిలువ ఉండగా ఒక్కో క్వింటాలుకు రూ.3,400 ధర ప్రకారం విక్రయించడంతో రూ.20 లక్షల వరకు లాభాన్ని కోల్పోయారు. గతంలో క్వింటాలుకు రూ.4,500 వరకు పలకగా, సీడ్ వ్యాపారుల గుత్తాధిపత్యంతో ధర పడిపోయి రైతులకు తీరని నష్టం మిగిల్చింది.

కుక్కల దాడిలో 20గొర్రెలు మృత్యువాత



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మల్లయ్యపల్లి గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో 20 గొర్రెలు మృత్యువాత పడినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. గ్రామంలోని కుర్మ మహేందర్‌కు చెందిన గొర్రెలపై కుక్కలు అకస్మాత్తుగా దాడి చేయడంతో 20 గొర్రెలు మృతి చెందాయని అన్నారు. మృతి చెందిన గొర్రెలను వెటర్నరీ వైద్యురాలు అర్చన పరిశీలించారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించేలా చూడాలని బాధితుడు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా ఎమ్మెల్యే మదన్‌మోహన్ చర్యలు తీసుకుంటారని మండల పార్టీ అధ్యక్షుడు సాయిబాబా బాధితుడికి హామీ ఇచ్చారు.

విద్యుత్ షాక్‌తో గేదె..



రుద్రూర్: మండలంలోని రాణంపల్లి శివారులో విద్యుత్ షాక్ తగిలి పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్ గేదెల పెంపకం ప్రధాన వృత్తిగా జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. శనివారం గేదెలను మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లగా ఒక గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మృతి చెందిన గేదె రూ.లక్షా 25వేల వరకు ఉంటుందని, నష్ట పరిహారం ఇప్పించాల్సిందిగా బాధిత రైతు కోరాడు.

మహిళ అదృశ్యం

రుద్రూర్: కోటగిరి మండలం వల్లాభాపూర్ గ్రామానికి చెందిన మేకల లక్ష్మి అదృశ్యమైనట్టు ఎస్సై సునీల్ శనివారం తెలిపారు. ఈ నెల 17న ఇంట్లోంచి వెళ్లిన లక్ష్మి ఇప్పటి వరకు తిరిగి రాలేదు.బంధువులు,స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త శివరాములు శనివారం పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్లు సీజ్



నిజాంసాగర్(జుక్కల్): కర్ణాటక రాష్ట్రానికి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను శనివారం సీజ్ చేసినట్లు డోంగ్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తెలిపారు. డోంగ్లి మండలంలోని మంజీరా వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో పట్టుకున్నామన్నారు.

క్రైం కార్నర్

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: చేపల వేటకు వెళ్లిన ఒకరు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ గ్రామంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. అడ్లూర్ గ్రామానికి చెందిన తోకల భాస్కర్ (38) చేపలు పట్టుకుని, అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. అతడు గురువారం సాయంత్రం గ్రామ శివారులోని వాగులో చేపలు పట్టడానికి వల వేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం చేపలు పడ్డాయా లేదా అని చూడటానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడి కుమారుడు బన్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరు..



నిజాంసాగర్: జుక్కల్ మండలంలోని మహమ్మదాబాద్ శివారులో శనివారం సాయంత్రం కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కౌలాస్ గ్రామానికి చెందిన భగవాన్ జావిద్ (48) అనే రైతు శనివారం కూరగాయలను తీసుకొని మోపెడ్‌పై జుక్కల్‌కు బయలుదేరాడు. మహమ్మదాబాద్ శివారులో అతడిని ఔరాద్ నుంచి బిచ్కుంద వెళుతున్న కర్ణాటక బస్సు ఢీకొట్టింది. అనంతరం బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. జీజీహెచ్‌లోని రేకుల షెడ్డు వద్ద శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉండగా, సెక్యూరిటీ సిబ్బంది అతడిని హాస్పిటల్‌కు తరలించారు. అతడిని వైద్యులు పరీక్షించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు లేబర్ పని చేసుకునే వ్యక్తిగా కనపడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు బ్లూ కలర్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించినట్లు చెప్పారు. సుమారు 45నుంచి 50ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందన్నారు. మృతుడి వద్ద ఆధార్ కార్డు లభించగా ఇందులో ఆర్మూర్ మండలం మామిడిపల్లి గ్రామం తెనాలి రవి ఉన్నట్లు చెప్పారు. గ్రామంలో విచారణ చేయగా ఇలాంటి వారు ఎవరు లేరని తెలిసింది, మృతుడికి సంబంధించిన సమాచారం కోసం ఒకటో టౌన్ పోలీసులను, 8712659714ను సంప్రదించాలని తెలిపారు.

ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు

ఎడపల్లి(బోధన్): తనకు, కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉందని మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన సుండు సతీష్ శనివారం సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. తనపై కక్ష గట్టిన సుండు యాదగిరి, అరుణ్ కుమార్, సుండు నర్సయ్యలు తనను చంపడానికి యత్నిస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకువాలని, తనకు కుటుంబసభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఇప్పటి వరకు తనపై తన ఇంటిపై రెండు సార్లు దాడి చేశారని, దాడులకు సంబంధించిన వీడియోలను ఎడపల్లి పోలీసులకు ఇచ్చి ఫిర్యాదు చేశానన్నారు. కానీ ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని సీపీ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో రైతుబజార్ పక్కనే ఉన్న బేకరి, ఎగ్ సెంటర్ రేకుల షెడ్ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో దుకాణంలో మంటలు చెలరేగి సామగ్రి పూర్తిగా దగ్ధం అయింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. రూ. 2లక్షలకు పైగా నష్టం జరిగిందని దుకాణం యజమాని ఆసిఫ్ తెలిపారు.

బోల్తా పడిన ఆటో.. పలువురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం గగ్గుపల్లి శివారులో శనివారం తెల్లవారు జమున ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఆలూర్ మండల కేంద్రానికి చెందిన ఏడుగురు మహిళలు ఉదయం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో పని నిమిత్తం ఆటోలో బయలుదేరారు. గగ్గుపల్లి శివారులో ఆటోకు పంది అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కరెంట్‌షాక్‌తో ఒకరికి ..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఓ వ్యవసాయ బోరు వద్ద నీరు తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని పర్మళ్ల తండాకు చెందిన మాలావత్ సక్రాం మండలకేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో గల ఓ వ్యవసాయ బోరు వద్దకు నీరు తాగేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కామారెడ్డికి తరలించి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని పూలాంగ్ పాత బ్రిడ్జి వద్ద తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 23న ఇంటి యజమాని చిన్నయ్య ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు శనివారం ఇంటి తాళం పగులగొట్టి, బీరువాను ధ్వంసం చేసి మూడు తు లాల బంగారం , రూ.50వేల నగదును ఎత్తుకెళ్లిన ట్లు చెప్పారు. దుండగుల అలజడికి పక్కింట్లోని వా రు నిద్రలేవగా వారు బైక్‌లపై పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాజుల్‌పేట్‌లో..

నగరంలోని గాజులపేట్ పోతలింగన్న గుడి వద్ద తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన నాగభూషణం(90) నెలరోజుల క్రితం ఇంటికి తాళం వేసి, ఊరికి వెళ్లారు. శనివారం వేకువజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోకిని ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ విషయమై ఎస్సై యాసీన్‌ఆరాఫత్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదం కాదు.. హత్యే..

- ఈనెల 3న జరిగిన సికింద్రాపూర్ యాక్సిడెంట్ కేసును చేధించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డిచ్‌పల్లి సీఐ మల్లేష్

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్ 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఈ నెల 3న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మొదట యాక్సిడెంట్‌గా భావించగా, ఇటీవల హత్యగా పోలీసులు నిర్ధారించారు. జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై తిరుపతి నిందితుల వివరాలను వెల్లడించారు. డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లికి చెందిన భైరం రవీంద్రవర్మ (37) హైవేపై తలకు గాయాలై అనుమానస్పద స్థితిలో పడి ఉండగా జక్రాన్‌పల్లి పోలీసులు అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మొదటగా జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి గుర్తు తెలియని వాహనం ఢీకొని రవీంద్ర వర్మ మృతి చెందాడని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కానీ ఘటన స్థలంలో మృతుడి సెల్‌ఫోన్, బ్యాగ్ లభించకపోవడంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా నిందితులు ఏ1 లక్ష్మీనర్సింలు, ఏ2 చింతల కృష్ణ, ఏ3 కడమంచి మారుతిని పట్టుకుని విచారించారు. వీరు ముగ్గురు కూడా బంధువులు. జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు నిందితులు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని పథకం ప్రకారం దారిదోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. అందులో భాగంగానే రవీంద్ర వర్మను ముగ్గురు నిందితులు లిఫ్ట్ ఇస్తామని తమ వాహనంపై ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లాక సికింద్రాపూర్ గ్రామ శివారులో వాహనాన్ని ఆపి పథకం ప్రకారం రవీంద్ర వర్మను భయపెట్టి, అతని వద్ద గల సెల్‌ఫోన్, బ్యాగ్, డబ్బులు దోచుకున్నారు. రవీంద్ర వర్మ ఎదురు తిరగడంతో వారు బండరాయితో మోదడంతో స్పృహ కోల్పోయి కిందపడిపోయాడు. నిందితులు అతడిని 44వ నెంబర్ జాతీయ రహదారిపై పడేసి ఏదో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్లు చిత్రీకరించారు. మృతుడి సెల్‌ఫోన్‌ను కనుక్కోవడంతో అసలు విషయం బయటపడింది. దీంతో రవీంద్ర వర్మను హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు. నిందితుల వద్ద నుంచి సెల్‌ఫోన్‌లతో పాటు స్కూటీ, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, సిబ్బందిని సీఐ అభినందించారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిజామాబాద్ నార్త్‌రూరల్ పోలీస్ స్టేషన్ ఆవణలో శనివారం సీఐ శ్రీనివాస్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముప్కాల్ మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన ముగ్గురు కూలీలు కాలూర్ లత, పంతుల విజయ, ఈర్ల సాయికుమార్ ప్రతిరోజు కలిసి కల్లు తాగేవారు. ఈక్రమంలో ఈజీగా డబ్బు సంపాదించాలనే ఆలోచనలో షేర్‌చాట్‌ను ఫాలో అయ్యారు. కత్తి, కారంతో ఒక మహిళను బెదిరించి.. బంగారం దొంగిలించిన వీడియో వీరికి నచ్చింది. అంతే శుక్రవారం నవీపేటలో వారాంతపు కూరగాయల సంత ఉండడంతో అమాయకుల కోసం గాలించారు. ఈ క్రమంలో మండలంలోని నారాయణ్‌పూర్‌కు చెందిన రాచర్ల కిష్టాబాయి అనే వృద్ధురాలు ఒంటరిగా వెళ్తుండగా ఆమెను వెంబడించారు. కత్తితో బెదిరించి.. కంట్లో కారం చల్లి..బంగారు పుస్తెల గుండ్లు, పడిగెలను దోచుకుని పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

తెలియక పురుగులమందు తాగిన బాలుడు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్దతండాకు చెందిన శ్రీయాన్స్ (సంవత్సరంన్నర బాలుడు) శనివారం ఉదయం పురుగుల మందు తాగినట్లు తండా వాసులు తెలిపారు. బాలుడి తల్లిదండ్రులు రవీందర్, శాను ఉదయాన్నే ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఇటీవల పశువులకు కోసం తెచ్చిన మందును ఇంట్లో పెట్టారు. బాలుడు ఇంట్లో ఆడుకుంటూ పురుగుల మందు అని తెలియక తాగాడు. నురుగులు కక్కుతుండడంతో చుట్టు పక్కల వారు గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

అలాగే 108కు సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాలుడు ఆరోగ్యంగా తిరిగి రావాలని తండా వాసులు ప్రార్థిస్తున్నారు.